

**94**

**ధారావాహిక**

# జాయ సేనాపతి

మత్తి భానుమూర్తి
99893 71284

చారిత్రక కాల్పనిక నవల

**జరిగిన కథ :** ఆతుకూరు గ్రామంలో వెలసిన రుద్రేశ్వరస్వామి దేవాలయం ప్రతిష్ఠాపనా మహోత్సవానికి రావాల్సిందిగా.. జాయపసేనుడికి ఆహ్వానం పంపాడు ఆతుకూరు మండలేశ్వరుడు రుద్రయ సేనాని. ఆ ఆహ్వానపత్రికను పృథ్వీశ్వరుడే స్వయంగా తమ్మునికి చదివి వినిపించి ఆనందించాడు! ఆ ఆహ్వానపత్రికతోపాటు.. బావగారు పంపిన మరో లేఖ. ఆ ముహూర్తవేళ జాయపుడు అక్కడ నృత్తం చేస్తే బావుంటుందని.. నాలుగు రోజులు ముందుగా రావాల్సిందిగా కోరాడు మహామండలేశ్వరుడు. ఆ లేఖలలో సాక్షాత్తూ ఆ రుద్రేశ్వరుణ్నే చూసుకుంటూ.. తనకు ఆ దేవళంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు జాయపుడు.

రుద్రేశ్వరాలయం ప్రతిష్ఠాపనా మహోత్సవానికి నాలుగురోజుల ముందే వెళ్లాడు జాయపుడు. దేవాలయ నిర్మాత రుద్ర సేనాని శిల్పకళాకారుల నివాసవాడలో ఆవాసం కల్పించాడు. కాలకృత్యాలు తీర్చుకుని దేవళం వద్దకు వెళ్లాడు జాయపుడు. ఏళ్ల తరబడి నిరంతరంగా రూపకల్పన జరిగి పూర్తిరూపం సంతరించుకున్న రుద్రేశ్వరాలయం.. శివుని కైలాసంలా సమున్నత నిశ్శబ్దంతో, ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్నది.

దేవళంలోకి వెళ్లాడు. మళ్లీ ఎన్నోఏళ్ల తర్వాత అదే గగుర్పాటు. లిప్తకాలపు స్పందనలు.. ఆనందంగా మొత్తం కలియదిరిగాడు. శిల్పశిల్పాన్నీ తడిమి చూశాడు. తన రూపాలను మరీమరీ చూసుకున్నాడు. అప్పుడే పక్కగా కాకతి! తృప్తిగా నవ్వుతున్నది. తనతో కలిసి చూస్తున్నది. ఇద్దరూ.. అన్నీ చూసుకుంటూ గుడి అంతా తిరుగాడుతున్నారు ఆనందంగా. లిఖిత సాహిత్యం, ఊహలు, సామాజికం, కళాత్మక ఊహలతో మేళవించగా వచ్చిన అద్భుత కళాసృష్టి. దాన్ని గుర్తిస్తే.. అదో కళాతృప్తి! అకళంక పారవశ్యం!!

బయట అలికిడి.. లలితాంబ!!

చీకటివెలుగుల క్రీనీడల్లో.. ఆ శిల్పాలమధ్య జాయపుని ముఖంలో తారాడుతున్న ఆనంద సందోహాల్ని అలా చూస్తూ లోపలికి వచ్చింది.

''పూర్తి రూపాలు చూసుకుంటున్నావా మామా..'' అన్నది మార్దవంగా.

పాతశిథిలాలపై కట్టిన కొత్తకోటలా ఉంది. కొత్త చిగురుల పచ్చదనం.. కాస్త ఒళ్లు చేసి మరికాస్త అందంగా.. మరిన్ని శృంగార హొయలయలు అదనంగా. కనువిందుగా ఉంది జాయపునికి.

''మామా.. నేనిప్పుడు మీ అక్క వారసురాలిగా కాకతీయ సామ్రాజ్య ఆస్థాన నర్తకిని!''.

అతని ముఖంలోకి చూస్తూ దగ్గరగా వచ్చి.. జాయపుని చేతులు పట్టి విడదీసి హత్తుకుంది.

పరవశుడయ్యాడు. అదన్నమాట.. బావగారి లేఖలో పేర్కొన్నది.

''అద్భుతం లలితా! మట్టి తల్లిలాంటిది. మోడువారిన కట్టె మట్టిలోపడినా.. దులిపి చిగురును జతచేస్తుంది. నీ జీవితం తిరిగి చిగురించినందుకు నాకంటే సంతోషించేవాడెవ్వడు?! సరే. అక్క.. మా అక్క ఎలా ఉంది?'' మధురత చిప్పిల్లేలా అడిగాడు.

ఆమె ముఖంలో ఉత్సాహం మాయమైంది.